# స్వామిజీ

(గల్పిక)

శ్రీ కొడవటిగంటి కుటుంబరావు

"పెద్దవాళ్ళను అట్లా అనగూడదురా, కుంకవెధవా! కళ్ళు కాస్తా పోతవి. అందులో స్వాములారు సామాన్యుడు కాడు. ఆయన త్రికాలవేది. ఆయన ఆజ్ఞ లేకుండా ఎక్కడా ఏమీ జరగదు" అన్నది అమ్మమ్మ.

"దానికి రుజువేమిటి, అమ్మమ్మా? స్వామిజీ మనకు కావలసిందేదన్నా చేస్తాడా?" అన్నాడు మనమడు.

"అట్లా ఎందుకు చేస్తాడూ? తన కిష్టమైనవే చేస్తాడు."

"అయితే మొన్న మనఊళ్ళో ఇళ్ళు తగలబడింది ఆయన మూలంగానేనా?"

"వాళ్ళు చేసుకున్న కర్మపరిపాకం కొద్దీ వాళ్ళ కొంపలు కాలినవి!" అన్నది అమ్మమ్మ.

"అయితే మధ్య స్వామిజీ చేసే దేమిటీ?"

"ఎవరి పాపానికి తగ్గట్టు వారికి శిక్ష ఇవ్వటమే."

"ఆయనే ఇస్తున్నాడని నీ కెట్లా తెలుసు?"

"తెలీదా ఏమిషి? అన్నమంతా పట్టి చూడాలా?"

"పోనీ కొంత పట్టి చూశావుగా, చెబుమా?"

"కమలమ్మకొడుకు రాఘవయ్యకేమయిందీ? బయల్దేరి రమ్మని స్వామివారు కబురుచేస్తే రాలేదు. మూడో నాటికల్లా మూడొందలూ చోరీ అయిందా లేదా?"

"నిన్న నాది అణా పోయింది. స్వామిజీయే కాజేసి ఉంటాడా, అమ్మమ్మా."

"ఛీ! అప్రాచ్యుడా! అప్రాచ్యంగా వాగుతావు!"

"అంతకోప్పడతావేం? రోజూ ఎక్కడో కక్కడ దొంగతనాలూ, హత్యలూ జరుగుతూనే ఉన్నాయిగదా. ఇదంతా స్వామిజీయే చేస్తున్నాడంటావా? కమ్యూనిస్టులు కొన్ని పనులు చేస్తున్నట్టు పత్రికల్లో రాస్తున్నారే. వట్టిదేనా?"

"పత్రికలవాళ్ళకొకటి తెలిసేడిచింది కనకనా? ఈ గొప్పగొప్పవిషయాలు వాళ్ళకేం తెలుస్తవిరా?"

"పోనీ, నువు చెప్పు. ఇంకేం చేశారు, స్వామిజీ?"

"ఒకటా? కాంతారావుకంత పెద్ద ఉద్యోగం ఎట్లా అయింది?"

"ఆ ఉద్యోగానికి వాడు ఆరునెల్లకిందే దరఖాస్తు పెట్టాడు, అమ్మమ్మా?"

"ఆరునెల్లనుంచీ కాని ఉద్యోగం స్వాములారు వాళ్ళింటి గడపతొక్కిన మర్నాడే కావటమేం?"

"ఉద్యోగం ఇస్తూ ఆర్డరుపడేనాటికి స్వామిజీ ఇంకా గడప తొక్కలేదే?"

"ఏడిశావు, కుర్రకుంకవు! నీ కివేం తెలుస్తవిరా?"

"ఇంకా చెప్పు, అమ్మమ్మా! స్వామిజీ లీలలు విన్నకొద్దీ ముచ్చటగా ఉన్నాయి."

"ముచ్చటగా ఉండవూ? ఆ సత్తెన్నారాయణ ఇట్లాగే నవ్వాడు. అందుకే వాడెక్కిన రైలు కాస్తా అంత పాటుపడింది."

"మొన్న సూళ్ళూరుపేటదగ్గిర పడిపోయిన ఎక్స్‌ప్రెస్ బండే?"

"కాదుట్రా మరీ?"

"స్వామిజీ పడగొట్టిందే?"

"ఏం, ఆయన కిదొక లెక్కనుకుంటున్నావా?"

"అయితే ఉండు, అమ్మమ్మా! పోలీసు వాళ్ళకు ఇప్పుడే ఉత్తరం రాస్తాను?"

"ఏమనీ?"

"రైలు పడగొట్టింది ఎవరో తెలీక పోలీసులు అల్లాడిపోతున్నారు. స్వామిజీ చేసినట్టు వాళ్ళకు చెబితే చాలా సంతోషిస్తారు. బహుమానం కూడా ఇస్తారనారు."

"చాల్లే, ఊరుకో!...వోరే, నిజంగా రాతామనే? పెట్టక్కడ కాగితాలూ, కలమూ!...చెబుతుంటే వినవుట్రా? పురుగులు పడిపోతావు సుమా!...స్వామివారికి కోపంవస్తే దుంప నాశనమైపోతుందే!... ఊరుకోరా! నీతో ఎందుకు మాట్లాడానురా?"

"ఆ స్వామిజీ మాట్లాడించి ఉంటాడులే అమ్మమ్మా! స్వామిజీ నన్నెందుకు భస్మం చేస్తాడూ? ఎరెస్టు చెయ్యబొయ్యే పోలీసుల్ని భస్మీపటలం చేస్తాడు. చూద్దాం, ఎవరు గెలుస్తారో?"

"పోలీసు లేం చేస్తార్రా స్వాములార్ని?"

"చేతికి సంకెళ్ళువేసి పెడరెక్కలు విరిచి నోట్లో గుడ్డలు కుక్కి లాక్కుపోతారు."

"వాళ్ళ చేతులు పడా! అంతపని చేస్తారుగా?...నాయన్నాయన, ఆ ఉత్తరం రాయకురా! నీకు పుణ్యం ఉంటుంది! నువ్వా ఉత్తరం రాస్తే నాకు పుట్టగతులుండవురా!"

"అసలు భయం అదా?...పోనీగాని, అమ్మమ్మా, స్వామిజీమీద నీకంత నమ్మకం ఉందే, పోలీసులమీద ఉన్నంతగా స్వామిజీమీద లేదేం?" అన్నాడు మనమడు, కాగితాలూ కలం అవతలపెట్టేస్తూ...

"స్వామివారంటే ఏమనుకుంటున్నావు, పున్నమ్మా?...ఇవాళపొద్దున మా మనమడు ఆయన్ను పోలీసులకు పట్టిస్తానని ఉత్తరం రాయబోయినాడు. అంతలో వాడిలో ఏం మార్పు కలిగించారో స్వామివారు. తీసిన కాగితాలూ, కలమూ అట్లాగే పెట్టేశాడు! అంతా స్వామివారి మహిమ!" అన్నది అమ్మమ్మ.

---


ఉత్తమ శైవమతగ్రంథము

**పండితారాధ్యచరిత్ర**

వెల రు. 5/-

(ప్యాకింగు, పోస్టేజి రు. 1-4-0)

మేనేజరు, ఆంధ్రగ్రంథమాల

మద్రాసు.